సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బాధితులకు అండగా ప్రభుత్వం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- 156 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బోయినపల్లి, ఆగస్టు 29: ప్రమాదాలతో పాటు అనారోగ్యానికి గురైన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 156మందికి ₹33.82లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసి, మాట్లాడారు. అనారోగ్యానికి గురైన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో జయశీల, మాజీ ఎంపీపీ వేణుగోపాల్, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బీసీ యువజన సంఘం జిల్లా నాయకుడు కూసరవీందర్, నాయకులు బండి శ్రీనివాస్, ఎల్లేశ్, పురుషోత్తమ్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ
- వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఆగస్టు 29: వ్యవసాయ మార్కెట్ అభివృద్ధే లక్ష్యంగా నూతన పాలకవర్గం పని చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. జంగంరెడ్డిపల్లిలోని మాతా అన్నపూర్ణేశ్వరి కల్యాణ మండపంలో గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణీ స్వీకారోత్సవం నిర్వహించారు. సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ మార్కెట్ అభివృద్ధికి నూతన పాలకవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో వ్యవసాయ మార్కెట్ కార్యాలయాలు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఐరెడ్డి చైతన్య, వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, మాజీ ఎంపీపీలు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి పాల్గొన్నారు.

భూ కబ్జాదారుడి అరెస్ట్

వేములవాడ, ఆగస్టు 29: భూ కబ్జాదారుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని గురువారం వేములవాడ ఏఎస్పీ శేషాద్రి నీరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, కొంతకాలంగా వేములవాడలో జీవనోపాధి పొందుతూ గాంధీనగర్‌లో ఉంటున్న సాంధారికారి వీణకు అత్తగారి ఊరైన జగిత్యాల జిల్లా కేంద్రంలోని మొచి వాడాలో ఇల్లు ఉంది. వీణ అత్తగారింటిని విక్రయిస్తున్న తరుణంలో వోటారికారి భూమేశ్ తెలుసుకొని మాయమాటలు చెప్పి.. ఆ ఇంటిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఆ తదుపరి భూమేశ్ ₹45లక్షలకు ఇంటిని ఇతరులకు విక్రయిస్తున్నట్లు వీణకు తెలియడంతో తనకు డబ్బులు ఇవ్వాలని అడిగింది. చాలా రోజులు తిప్పించుకొని ₹20లక్షలు మాత్రమే ఇచ్చి.. మిగతా డబ్బు అడిగితే చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు వీణ ఠాణాలో ఫిర్యాదు చేయగా, భూమేశ్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్ తరలించామని ఏఎస్పీ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217
CHANGE OF NAME
★Paspunuri Hanmandlu, S/o. Paspunuri Bhoomaiah H.No. 2-4-11, Gambhiraopet proper & mandal Rajanna Sircilla my Name was changed as Pasupunuri Hanmandlu S/o Pasupunuri Bhumaiah.
NTK-325543
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

'పాక్సో యాక్ట్' పై అవగాహన పెంచుకోవాలి

- వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి

వేములవాడ రూరల్: నాంపెల్లిలోని నిర్మల్ పాఠశాలలో మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి

వేములవాడ రూరల్, ఆగస్టు 29: బాలబాలికలు పోక్సో యాక్ట్‌పై అవగాహన పెంచుకోవాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి సూచించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని నాంపెల్లి నిర్మల పాఠశాలలో గుడ్ టచ్-బ్యాడ్ టచ్, పోక్సో యాక్ట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, జిల్లా పోలీస్‌శాఖ విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. విద్యార్థులు చక్కటి లక్ష్యాలను ఎన్నుకుని సరైన మార్గంలో శ్రమిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతిఒక్కరూ పోక్సో యాక్ట్, గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలన్నారు. పోక్సో పై చైతన్యం పేరుతో జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వెంటనే తల్లిదండ్రులతోపాటు డయల్ 100కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి పీ లక్ష్మీ రాజం, షీ టీం ఏఎస్ఐ ప్రమీల, షీ టీం సిబ్బంది రమాదేవి, ప్రియాంక, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో..

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 29: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు, చంద్రంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు లైంగిక వేధింపుల, పోక్సో చట్టాలపై ఎస్ఐ మల్లేశం, మహిళా చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ పరమేశ్వర్ అవగాహన కల్పించారు. బాలబాలికల గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఆపద సమయాల్లో డయల్ 100కి గానీ, 1098 హెల్ప్‌లైన్‌కి కాల్ చేయాలన్నారు. ఇక్క ఇన్‌చార్జి హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

గుడ్‌టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

ఇల్లంతకుంట, ఆగస్టు 29: మండల కేంద్రంలోని కేరళ మోడల్ స్కూల్‌లో గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై గురువారం విద్యార్థినులకు ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ అవగాహన కల్పించారు. ఎవరైనా వేదింపులకు గురి చేస్తే వెంటనే డయల్ 100కి గానీ, 1098కి గానీ కాల్ చేయాలని సూచించారు.

చీటింగ్ కేసులో ఒకరి రిమాండ్

తెలంగాణ చౌక్, ఆగస్టు 29: చీటింగ్ కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన బుట్టం పద్మ తనకు సంబంధించిన భూమిలో బోరు వేసేందుకు పర్మిషన్ కోసం అధికారులు చుట్టూ తిరుగుతున్నది. మున్సిపల్ అధికారులు తనకు తెలుసునని.. బోరు వేసేందుకు పర్మిషన్ ఇప్పిస్తాననంటూ మున్సిపల్ పరిధిలోని పెద్దూర్‌కు చెందిన తుమ్మ విజయ్ పద్మ తల్లిదండ్రుల వద్ద నుంచి డబ్బులు తీసుకున్నాడు. పర్మిషన్ ఇప్పించకపోగా, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే ఎస్సీ, ఎస్టీ కేసు పెడుతానని బెదిరింపులకు గురి చేశాడు. పద్మ ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

మీ సేవా దరఖాస్తులు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ భీమ్యానాయక్

తీజ్ వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

కలెక్టరేట్/సిరిసిల్ల రూరల్, ఆగస్టు 29: మీ-సేవా కేంద్రాల ద్వారా వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సిరిసిల్ల, తంగళ్లపల్లిలోని తహసీల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన రైతులతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకుని ఎన్ని రోజులు అయింది.. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో పెట్టవద్దని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎండీ షరీఫ్ మొహియొద్దీన్ ఉన్నారు.

తీజ్‌లో వేడుకల్లో అదనపు కలెక్టర్

గంభీరావుపేట, ఆగస్టు 29: సముద్రలింగాపూర్ పరిధిలోని మక్త నాయక్ తండాలో గురువారం తీజ్ వేడుకలు నిర్వహించగా, అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ హాజరయ్యారు. ఉపవాస దీక్షలతో ఉత్సవాల్లో పాల్గొన్న యువతులకు ఆయన శుభాకాంక్షలు తెలిపార. కాసేపు వారితో సరదాగా గడిపారు. ఇక్కడ బంజారా సేవా సంఘ జిల్లా నాయకుడు బానోత్ గోపినాయక్, నాయకులు అజ్మీరా భాస్కర్, ప్రవీణ్, రమేశ్, గంగారాం, తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ నుంచి వీసీకి హాజరైన అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, అధికారులు

ఓటరు జాబితా రూపొందించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి
- వీసీ ద్వారా సమీక్ష

కలెక్టరేట్, ఆగస్టు 29: గ్రామ పంచాయతీల వారీగా ఓటర్, పోలింగ్ స్టేషన్ల జాబితాను రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీల వారీగా ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితా తయారీపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీపీవోలతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఓటరు జాబితా తయారీ, మ్యాపింగ్ పనులు చేసేందుకు ప్రతి మండలంలో డేటాఎంట్రీ ఆపరేటర్, కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయం ఉండేలా చూసుకోవాలన్నారు. ఓటరు జాబితాను సెప్టెంబర్ 6న గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించాలన్నారు. సెప్టెంబర్ 9న జిల్లాలోని రాజకీయ పార్టీలతో ఎన్నిల అధికారులు, 10న ఎంపీడీవోల ఆధ్వర్యంలో మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులపై 7 నుంచి 13 వరకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. పూర్తి స్థాయి జాబితాను 21లోగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే ఓటర్ జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్, రూపొందించడంలో ఉత్తమ ప్రతిభ చూపిన జిల్లా అధికారులను ప్రశంసించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీవో వీరబుచ్చయ్య, ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

బోయినపల్లి, ఆగస్టు 29: శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి దిగువన ఉన్న ఎల్ఎండీకి గురువారం 21,150 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఎస్సారార్ జలాశయానికి కరీంనగర్ జిల్లా రామడుగు మండల లక్ష్మీపూర్ గాయత్రీ పంప్ హౌస్ నుంచి వరద కాలువ ద్వారా 9,112 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 16.73 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

పోశెట్టి ఎన్నికపై హర్షం

రుద్రంగి, ఆగస్టు 29: కళాకారుల రాష్ట్ర కన్వీనర్‌గా యెల్ల పోశెట్టి ఎన్నికపై మండల కేంద్రంలో సాంస్కృతిక కళా సంస్థని సమైక్య కళాకారులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. యెల్ల పోశెట్టి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్నిక కావడం సంతోషకరమన్నారు. ఇక్కడ మండలాధ్యక్షుడు చంద్రయ్య, చందుర్తి మండలాధ్యక్షుడు దొంగరి లక్ష్మీరాజం, కళాకారులు దేవయ్య, రమణయ్య, సత్తయ్య, తదితరులు ఉన్నారు.

ఐదుగురిపై కేసు

తెలంగాణ చౌక్, ఆగస్టు 29: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 23న ఇల్లంతకుంట మండలం ఆరెపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా డీజే నిర్వహించడంతో పోలీస్ అధికారులు అక్కడి వెళ్లారు. ఈ క్రమంలో వారి విధులకు ఆటంకం కలిగించిన బుర్ర సూర్య, బుర్ర స్వామి, చరణ్, నీలం మహిపాల్, సంజయ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. అలాగే కేశనపల్లికి చెందిన చిట్యాల హరీశ్‌పై కూడా కేసు నమోదు చేసి డీజే సీజ్ చేసినట్లు తెలిపారు.

రైతుల నుంచి అర్జీల స్వీకరణ

బోయినపల్లి: రైతువేదికలో దరఖాస్తు చేసుకుంటున్న రైతు

బోయినపల్లి, ఆగస్టు 29: మండల కేంద్రంతోపాటు తడగొండలో రుణమాఫీ కాని రైతుల నుంచి గురువారం ఏవో ప్రణీత దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, రెండు గ్రామాల్లో కలిపి రైతుల నుంచి 60మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రుణమాఫీ కానీ రైతుల నుంచి గ్రామాల వారీగా అర్జీలు తీసుకున్నట్లు ఏవో చెప్పారు. 30న దుంద్రపల్లి, కోరెం, బూర్గుపల్లి, 31న గుండన్నపల్లి, స్తంభంపల్లి, రామన్నపేట, సెప్టెంబర్ 2న రత్నంపేట, దేశాయిపల్లి, జగ్గారావుపల్లి, 3న కొదురుపాక, నీలోజిపల్లి, వెంకట్రావ్‌పల్లి, నర్సింగాపూర్ 4న కొత్తపేట, మల్లాపూర్, మాన్వాడ, 5న విలాసాగర్, మర్లపేట గ్రామాల్లో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాలవారీగా దరఖాస్తులు స్వీకరిస్తాం

ఇల్లంతకుంట, ఆగస్టు 29: పలు కారణాలతో రుణమాఫీ కాని రైతుల నుంచి గ్రామాల వారీగా దరఖాస్తులు స్వీకరిస్తామని ఏవో సురేశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు రేపాకలో 44మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దాదాపు మండలంలో 10రోజుల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

గంభీరావుపేట, ఆగస్టు 29: కొత్తపల్లి, శ్రీగాధ గ్రామాల్లో పంట రుణాలు మాఫీ కాని రైతు కుటుంబాలను వ్యవసాయ విస్తీర్ణాధికారులు సర్వే చేశారు. పంట రుణం పొంది రేషన్‌కార్డు లేని కుటుంబాలను సర్వే చేసి, వారి వివరాలను రైతు భరోసా యాప్‌లో నమోదు చేస్తున్నామని ఏఈవోలు ప్రవీణ్, సాయి, గౌతమి తెలిపారు.

ముస్తాబాద్, ఆగస్టు 29: రుణమాఫీ కాని రైతుల కోసం వ్యవసాయ శాఖ అధికారులు సర్వే ప్రారంభించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో దరఖాస్తులు స్వీకరించారు.

'రాజన్న'కు శ్రావణ సందడి

ఆలయ గర్భగుడి ఎదుట స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, ఆగస్టు 29: శ్రావణ మాసం సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం గురువారం భక్తులతో సందడిగా కనిపించింది. వేకువజాము నుంచే భక్తులు ధర్మగుండంలో స్నానాలు ఆచరించి రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నను 10వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, సుమారు రూ.9లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

ఆరుద్ర నక్షత్రం.. అందులో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజన్న ఆలయంలో స్వామివారికి ఉదయం ప్రాతఃకాల పూజల అనంతరం అర్చకులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. తర్వాత లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని కనుల పండువగా జరిపించారు. ఇక్కడ ప్రధాన అర్చకులు నమిలికొండ ఉమేశ్, ఈశ్వరగారి సురేశ్, నమిలికొండ రాజేశ్వర శర్మ, దుమాల నాగరాజు, వాసు, ప్రతాప శ్రీనివాస్, గోపన్నగారి గణేశ్ ఉన్నారు.

రేషన్ డీలర్‌షిప్‌కు ఆహ్వానం

కలెక్టరేట్, ఆగస్టు 29: సిరిసిల్ల డివిజన్ పరిధిలోని సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో చౌకధరల దుకాణం డీలర్‌షిప్ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆర్డీవో రమేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29నుంచి సెప్టెంబర్ 4 లోగా తహసీల్ కార్యాలయాల్లో దాఖలు చేయాలన్నారు. సెప్టెంబర్ 14న రాత పరీక్ష, తర్వాత ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

కోనరావుపేట, ఆగస్టు 29: మహిళలు ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం పెరటి కోళ్లను అందజేస్తున్నదని ఏపీఎం రాకేశ్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళా సంఘం సభ్యులకు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మొదటి విడుతగా 25మంది లబ్ధిదారులకు సోనాలి రకానికి చెందిన 850మంది పెరటి కోళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. వట్టిమల్లలో మధర్ యూనిట్ ప్రారంభించినట్లు చెప్పారు. ఇక్కడ సీసీ రేణుక, శ్రీదేవి, శోభారాణి, తదితరులు ఉన్నారు.

హెచ్ఎం కు నివాళి

వేములవాడరూరల్, ఆగస్టు 29: నూకలమర్రి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పూరెల్ల రవీందర్(60) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. రవీందర్ మృతదేహానికి టీపీటీఎఫ్ నాయకులు పూలమాల నివాళులర్పించారు.

ఏకకాలంలో గుడుంబా స్థావరాలపై దాడులు

- 19మందిపై కేసు
- ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణచౌక్, ఆగస్టు29: జిల్లావ్యాప్తంగా ఏకకాలంలో గుడుం బా స్థావరాలపై గురువారం దాడులు చేసి, 19మందిపై కేసు నమోదు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిషేధిత నాటుసారా తయారు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక టీంలుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు చేయడగా పట్టుపడిన 133లీటర్ల జాగిరిని నేలమట్టం చేశామన్నారు. 27లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని 19మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

35లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

వీర్నపల్లి, ఆగస్టు29: ఎస్పీ అఖిల్‌మహాజన్ అదేశాల మేరకు రంగంపేటలో సోదాలు నిర్వహించి 35లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, మూడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఎవరైనా గుడుంబా తయారీ చేసినా.. రవాణా చేసిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎల్లారెడ్డిపేట మండలంలో..

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 29: కిష్టానాయక్ తండా, బుగ్గరాజేశ్వరతండాలో భూక్యా రమేశ్, బడావత్ లత ఇంట్లో గురువారం వేర్వేరుగా దాడులు చేసి రెండు లీటర్ల చొప్పున మొత్త నాలుగు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

హెచ్ఐవీపై ఎంఎల్‌పీలకు శిక్షణ

కలెక్టరేట్, ఆగస్టు 29: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మిడ్ లెవెల్ హెల్త్‌కేర్ ప్రొవైడర్లకు (ఎంఎల్‌హెచ్‌పీ) డీఎంహెచ్‌వో డా వసంతరావు ఆధ్వర్యంలో హెచ్ఐవీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఎంహెచ్‌వో వసంతరావు అవగాహన కల్పించారు. ఇక్కడ డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డా ఎస్ రజిత, డా రాజగోపాల్, డా అంజలి ఆల్ఫ్రెడ్, డాక్టర్ నైమ్ జాన్, డీపీఎం సురేందర్‌బాబు, ఉమాదేవి, డీపీవో రాజ్‌కుమార్, సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీలు ఉన్నారు.

రైతు వేదిక పరిశీలన

బోయినపల్లి, ఆగస్టు29: మండల కేంద్రంలోని రైతు వేదికను పంచాయతీరాజ్ ఈఈ భూమేశ్వర్, డీఈఈ లక్ష్మణ్‌రావు గురువారం పరిశీలించారు. వేదిక గ్రౌండ్‌తోపాటు గోడలు పగుళ్లు పట్టాయని ఏవో ప్రణీత ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు రైతు వేదికను పరిశీలించి.. ప్రమాదకరంగా ఉన్నట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం మరోసారి పరిశీలించి కొలతలు వేయనున్నారు. ఇక్కడ ఏఈ విష్ణుప్రసాద్ ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 29: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, వారు ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాల్సిన బాధ్యత అధ్యాపకులదేనని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ దేవరాజు, అధ్యాపకులు ఉన్నారు.

సన్మార్గంలో పయనించాలి : ఎస్పీ

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

వేములవాడ, ఆగస్టు 29: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో సన్మార్గంలో పయనించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. గురువారం ఆయన వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేములవాడ పట్టణ, రూరల్, బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వివిధ నేరాల్లో నిందితులుగా ఉన్నవారు పోలీసు అధికారులు తెలిపిన సమయాల్లో పోలీస్‌స్టేషన్‌కు హాజరుకావాలన్నారు. లేకుంటే బైండోవర్ చేస్తామన్నారు. రౌడీ, హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తెలిపారు. గంజాయి పాజిటివ్ వచ్చిన వారి నుంచి సరఫరా దారులను పట్టుకుంటున్నామని చెప్పారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు మారుతి, పృథ్వీధర్‌గౌడ్, అంజయ్య పాల్గొన్నారు.

ప్రజా పాలనా పది రోజులేనా..?

- మిగతా రోజుల్లో రాక్షస పాలనేనా..

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్

కలెక్టరేట్, ఆగస్టు 29: పది రోజుల్లో చేసేది ప్రజాపాలన.. మిగతా రోజుల్లో రాక్షస పాలనా.. అని బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ యూత్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. సెప్టెంబర్ 17నుంచి ప్రజాపాలన అంటే.. ఇన్ని నెలలుగా చేసింది రాక్షస పాలనా.. అని ప్రశ్నించారు. ఈ పది రోజులు ప్రజాపాలన చేసి.. మిగతా 354రోజులు ప్రజల సమస్యలు గాలికి వదిలేస్తారా.. అని నిలదీశారు. ఇచ్చిన హామీలు, పథకాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి హైడ్రా పేరుతో